


హైదరాబాద్‌లో ఫ్రండ్స్‌ని కలుసుకోడమంటే బోల్డు ఖర్చుతోపని. బెజవాడ, బందరు అయితే చిక్కు లేదు. ఫ్రండ్సంతా రెండు మైళ్ళ పరిధిలో వుంటారు. హైదరాబాదులో అట్లా కాదు. ఒకడు సనత్‌నగర్‌లో వుంటే మరొకడు మలక్‌పేటలో వుంటాడు. ఆ మూల నుంచి ఈ మూలకు రావాలంటే దుంప తెగుతుంది. సనత్‌నగర్ నుంచి మలక్‌పేటకి తెగించి వస్తే ఇంటి దగ్గర ఫ్రండు వుండడు. వాడు మరో ఫ్రండుని కలుసుకోవడానికి విజయనగర్ కాలనీకి వెళ్ళినట్లు తెలుస్తుంది. ఇంత దూరం వచ్చి తిరిగి వెళ్ళి

పోవడం యిష్టం వుండదు. పైగా విజయనగర్ కాలనీ వెళితే ఇద్దరు మిత్రులని కలుసుకోవచ్చు కనుక ప్రయాణం విజయనగర్ కాలనీకి సాగుతుంది. అక్కడ కూడా జాతకం తిరగ బడుతుంది. ఆ ఇద్దరూ చిక్కడపల్లిలో చిక్కడినట్లు సమాచారం అందుతుంది. ఫ్రండాన్వేషణలో ఎట్లాగూ తల దూర్చాం గనుక ప్రయాణం చిక్కడపల్లికి తప్పదు. అక్కడ మొత్తం ముగ్గురు క్షణం క్రితమే సనత్‌నగర్ కదిలినట్టు తెలుస్తుంది. దాంతో స్పృహ తప్పుతుంది. ఓపిక నశించడం వల్ల స్పృహ తప్పిందని అనుకోరాదు. జేబులో డబ్బు మొత్తం ఆటో చార్జీలకు అయిపోవడం వల్ల మనిషి డీలా పడిపోయేడని అర్థం చేసుకోవాలి.

చిన్నప్పుడు చిత్రమైన ఆటొకటి మనందరికీ గుర్తుండే వుంటుంది. పుస్తకంలో మన పేరెక్కడ రాసుకున్నామో తిన్నగా చెప్పకుండా అవస్థ పెట్టడం ఒక సరదా. నా పేరు ఇరవై ఏడో పేజీలో వుంటుందని రాస్తాం. ఆ పేజీ తిప్పితే అక్కడ ముప్పై ఆరో పేజీలో చూడమంటాం. ముప్పై ఆరో పేజీలో డెబ్బైరెండో పేజీ తిప్పమంటాం. ఇట్లాగ పుస్తకమంతా తిప్పుతామేగానీ పేరెక్కడా కనిపించదు. అవి పేజీలు గనక సరిపోయింది. ఇంత పెద్ద నగరంలో ఫ్రండు ఎక్కడున్నాడో కనుక్కోడం కూడా ఇట్లాంటి ఆటే. పోతే అంతకంటే హింస మరొకటి వుండదు. నెల జీతంలో సగం డబ్బు ఆ వేటకే తగలేయాల్సి వుంటుంది.

నా మీద నా ఫ్రండ్సుకి అపారమైన అనుమానం. ఉంటానని హామీ యిచ్చి వాళ్ళొచ్చే వేళకి ఎటో పారిపోవడం నా హాబీ అని వాళ్ళ ఉద్దేశం. రాంబాబు నన్ను కలుసుకోవాలంటే కనీసం ముప్పై మూడు సార్లు ఫోన్ చేస్తాడు. ఫోన్ ఆఫీసు వాళ్ళది గనక అక్కడ తను జంకడు. వస్తున్నా, వస్తున్నానంటూ బెదిరించి మరీ వస్తాడు. వచ్చేవాడివి తిన్నగా రాకుండా ఫోన్ రాయబారాలెందుకు మధ్య అని విసుక్కుంటే మిమ్మల్ని నమ్మేదెవడు లెండి,

తీరా వచ్చిం తర్వాత మీరు లేకపోతే ఆటోలకి రానూపోనూ అయిదు రూపాయలు వేస్టవుతుంది అంటాడతను. ఆటో ఎందుకు బస్సులో రారాదూ అని సలహాకూడా ఇచ్చేను. అందుకతను చెప్పిన సమాధానం తృప్తికరంగా తోచింది. అతను వాళ్ళన్నయ్యదగ్గర ఉండి ఉద్యోగం చేస్తున్నాడు. బ్రహ్మచారి. వేళకి ఇంటికి వెళ్ళకపోతే అన్నయ్య ఏమైనా అనుకోవచ్చు. బస్సుల్ని నమ్ముకుంటే దొరుకుతాయీ దొరకవు. దొరికినా .... అందులో చోటు ఉంటుందీ వుండదు. ఆ రద్దీలో ఎక్కి దిగేసరికి తలనొప్పి ఖచ్చితంగా వస్తుంది. పైగా టైమొకటి. అందువల్ల ఆటోలు తప్పవన్నాడు. అతని సంపాదనలో సగం ఆటోలకి తగలేస్తున్నట్టు చెప్పాడు. అతనికి ఉన్న వ్యసనమల్లా స్నేహితులతో ముచ్చట్లు. ఇది అతని తాడు తెంచుతోంది. ఒక్కడికి యింత ఖర్చేమిటని ఇంట్లోవాళ్ళు వర్రీ అయిపోతున్నారట. చెడు తిరుగుళ్ళు ప్రారంభించాడేమోనని అనుమానం ఎక్కువవుతోందట. ఈ ఆటోల పుణ్యమాని నన్ను మా వాళ్ళు నమ్మడంలేదండీ అన్నాడు రాంబాబు.

మొన్నీ మధ్య జగన్నాథం ఆఫీసుకొచ్చి అర్జంటుగా పది రూపాయలు అప్పు కావాలన్నాడు. అతను అప్పు యిచ్చేవాడే కానీ తీసుకునే రకం కాదు. ఏమిటి ఖర్మ యిట్లా కాలిందని అడిగేను. అటు చూడమన్నాడు. కిటికీలోంచి చూస్తే ఆటో కనిపించింది. జగన్నాథం చెప్పడం ప్రారంభించేడు. బేంకు కెళ్ళి డబ్బు తీసుకుందామనుకుని ఆటో ఎక్కేను. టైమైపోయింది. సారీ అన్నారు బేంకువాళ్ళు. జేబులో పైసాలేదు. విడ్‌డ్రాయల్ ఫారం తప్ప. కనీసం ఆటోవాడికయినా డబ్బిచ్చి పంపాలికదా. అందుకోసం ఇదే ఆటోలో మూర్తి ఆఫీసు కెళ్ళేను. అతను కేంప్ కెళ్ళినట్లు చెప్పేరు. అట్నుంచి అటు ఆటోని శంకరింటికి తీసుకెళ్ళేను. అతను శాయి వాళ్ళింటికి వెళ్ళినట్లు తెలిసింది. శాయి వాళ్ళింటికెళితే వాళ్ళిద్దరూ యిక్కడికి వచ్చినట్టు చెప్పేరు. కనీసం యిక్కడైనా దొరుకుతారో దొరకరోనని వెయ్యి దేముళ్ళకీ మొక్కు-

కుంటూ వచ్చేను. ఈ తిరుగుడికి మొత్తం తొమ్మిది రూపాయలైంది. పదిస్తే రూపాయి మిగులుతుంది. దాంతో బస్సెక్కి ఇంటికి వెడతాను అన్నాడు. ఆ రోజు లగాయతూ నా దగ్గరికి ఏ ఫ్రెండు వచ్చినా ఆ వచ్చిన వాడు ఆటో బాధితు డవునోకాదో తేల్చుకునే నిమిత్తం కిటికీలోంచి రోడ్డు మీదకి చూడటం అలవాటైపోయింది. ఇంతకీ నే చెప్పదలుచుకున్న దేమి టంటే ఈ మహా నగరంలో మీకు చాలామంది స్నేహితు లుంటారు. వాళ్ళ క్షేమాన్ని కోరడం మీ ప్రథమ కర్తవ్యం. ఫలానాచోట ఫలానా వేళకు కలుసుకుందామని అనాలోచితంగా మాటివ్వకండి. మాటిస్తే దానికి కట్టుబడి వుండండి. అట్లాగే ఆఫీసునుంచి చెక్కేస్తున్నప్పుడూ కేంపులూ సెలవల్లో వెళ్ళేప్పుడూ ముందరే మీ ఫ్రెండ్స్‌కి చెప్పివుంచండి. ఈ ఒక సాయంచేసి పుణ్యం కట్టుకోండి.